చెరువుల ఆధునికీకరణకు ప్రణాళికలు

● జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



అక్కిరెడ్డిపాలెం చెరువు ఆధునికీకరణపై అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

అక్కిరెడ్డిపాలెం/గాజువాక: నగర పరిధిలో చెరువుల ఆధునీకరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జోన్–6 పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, చినగంట్యాడ, లంకెల పాలెం చెరువులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు నగరంలో చెరువులు ఆధునీకరిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఆహ్లాదం కలిగించే విధంగా చెరువులను తీర్చిదిద్దుతామన్నారు. చెరువుల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కల తొలగింపు, చెరువుకు నీరు చేరే కాలువలకు అడ్డంకులు లేకుండా పూడికలు తొలగింపుతో పాటు చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ప్రహరీ, పచ్చదనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ సింహాచలం, పర్యవేక్షక ఇంజినీర్లు గోవిందరావు, రవి, ఈఈ ప్రసాదరావు, ఏసీపీ మహాపాత్రో తదితరులున్నారు.

'మింది- పోర్టు' రోడ్డు విస్తరణకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డికి రాఖీ కడుతున్న కార్పొరేటర్ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది నుంచి పోర్టు రోడ్డుకు వెళ్లే రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలిసి శిలా ఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడుతూ మింది నుంచి పోర్టు రోడ్డు గుండా నగరానికి వెళ్లే వాహనాలకు ఈ రోడ్డు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ సమస్యలపై పలు దఫాలుగా పోర్టు అధికారులతో చర్చలు జరిపి, వారి నుంచి అనుమతులు తీసుకున్నామన్నారు. వారి కృషిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కొనియాడారు.

ఎమ్మెల్యేకు రాఖీ

ఎమ్మెల్యే నాగిరెడ్డికి కార్పొరేటర్ అనూష గురువారం రాఖీ కట్టారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం ఆమె రక్షాబంధన్ కట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు సంగ్రాన నూకరాజు, ఈటి సురేష్, చిట్టిబాబు, రొక్కం వెంకట్రావు, ప్రసాద్, జీవీఎంసీ ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వెంకట్‌కు గిడుగు సాహితీ పురస్కారం అందజేత



గిడుగు జాతీయ సాహితీ పురస్కారం అందుకుంటున్న కంచిపాటి వెంకట్

అగనంపూడి: తెలుగు సాహిత్యరంగంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్న అగనంపూడికి చెందిన యువ రచయిత కంచిపాటి నరసింహమూర్తి (వెంకట్) గిడుగు జాతీయ సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. సాహిత్యంతో పాటు పలు రంగాల్లో రాణించిన వారిని హైదరాబాద్‌కు చెందిన గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకర్ వేదిక తెలుగు భాషా దినోత్సవం రోజు ఘనంగా సత్కరించింది. ఈ మేరకు వెంకట్ ఈ పురస్కారం అందుకున్నారు. వెంకట్ ఇటీవల రచించిన అతన్ని అలా వదిలేయకండి కథా సంపుటికి గాను ఈ అవార్డును అందించారు. కార్యక్రమంలో గిడుగు కాంతికృష్ణ, బిక్కి కృష్ణ, వకుళాభరణం కృష్ణమోహన్, జెల్ది విద్యాధరరావు, యలవర్తి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నట్లు వెంకట్ తెలియజేశారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన



నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు షీలానగర్‌లోని గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు గురువారం కూడా నిరసన కొనసాగించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 30, 31 తేదీల్లో చేపట్టిన పెన్ డౌన్‌లో భాగంగా వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విధానం వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని, ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు.

భవిత కేంద్రం భవన నిర్మాణ పనుల పరిశీలన



భవిత కేంద్రంలో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ పీవో శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల పాఠశాల (భవిత కేంద్రం) నూతన భవన నిర్మాణ పనులను సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఇక్కడ పిల్లల ఫిజియోథెరపీ కోసం అభయం ఫౌండేషన్ మరియు స్పందన చేయూత ఫౌండేషన్ సంయుక్తంగా ఈ భవనాన్ని నిర్మిస్తున్నాయి. భవనాన్ని సందర్శించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లల శ్రేయస్సును కోరి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. నిర్మాణంలో భాగంగా హాలు, ఫిజియోథెరపీ సామగ్రి అమర్చడం, హైడ్రో థెరపీ, పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతినిధులు కలిదిండి రవి, ఈపూరి బుచ్చిరాజు సంస్థ తరపున చేస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో రాజన్‌రాజు, సీతారామరాజు, సమగ్ర శిక్ష అభియాన్ ఐఈ కో–ఆర్డినేటర్ అబ్దుల్లా ఆషా, ఎంఈవోలు విశ్వనాథన్, సునీత, ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాసరాజు, శివాజీ, చినభాస్కర్, విజయ, మూర్తి, ఆనంద్, జగదేవ్, మురళీధర్‌రెడ్డి, ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భెల్ ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంట్ విజయం



భెల్ ప్రధాన గేటు వద్ద ఏఐటీయూసీ శ్రేణుల సంబరాలు



బొండా బాబూరావు అధ్యక్షుడు



సుభాకర్ సాహు, ప్రధాన కార్యదర్శి

అక్కిరెడ్డిపాలెం: విశాఖలోని భెల్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) కూటమి గెలుపొందింది. బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్‌పై 28 ఓట్ల తేడాతో విజయం సాధించింది. గురువారం ఉదయం 9 గంటల నుంచి సంస్థ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ ముగిసిన గంట విరామం తర్వాత ఓట్ల లెక్కింపు నిర్వహించారు.

ఎన్నికల్లో మొత్తం 445 ఓట్లకు గాను 441 పోల్ అయ్యాయి. యునైటెడ్ ఫ్రంట్‌కు 225 ఓట్లు రాగా, బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్‌కు 197 ఓట్లు, భెల్ కార్మిక సంఘ్‌కు 16 ఓట్లు పోలయ్యాయి. చెల్లనివి 3 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి డి.శ్రీనివాసులు తెలిపారు. దీంతో 28 ఓట్ల తేడాతో యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) నుంచి బీహెచ్‌పీవీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గెలుపొందింది. ఎన్నికల అనంతరం ఏఐటీయూసీ శ్రేణులు సంస్థ ప్రధాన గేటు వద్ద డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో సందడి చేశారు. సంస్థలో బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విజయం సాధించిన బొండా బాబూరావు, సుభాకర్ సాహు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యల పరిష్కారానికి, కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తామని తెలిపారు. ఏఐటీయూసీ జాతీయ్య కార్యవర్గ సభ్యులు పడాల రమణ, కె.ఆదినారాయణ, కొల్లి దేముడు తదితరులు విజయం సాధించిన యూనియన్ నాయకులకు అభినందనలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో వానర దండు



విభాగాల్లో కోతుల మూక



షాపుపై ఎక్కి చూస్తున్న కోతి

ఉద్యోగుల అవస్థలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో కోతుల బెడద ఎక్కువైంది. వాటి చేష్టలకు ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం స్టీల్‌ప్లాంట్‌లోకి కొన్ని కోతులు చేరాయి. అవి మొదట్లో ప్రైవేటు క్యాంటీన్ల వద్ద దొరికే తిండిపై ఆధారపడి బతికేవి. ఉద్యోగులు క్యాంటీన్, పక్కన ఉన్న పాన్‌షాప్‌ల నుంచి బిస్కెట్లు, గారెలు వంటివి ఇవ్వడం మొదలుపెట్టారు. వాటిపై ఆధారపడి అక్కడే ఉండేవి. కోతుల సంతానోత్పత్తి ఎక్కువ కావడంతో అనతి కాలంలో వాటి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. సంఖ్యకు అనుగుణంగా ఆహారం అందుబాటులో లేకపోవడంతో అవి క్యాంటీన్లలోకి చొరబడటం, పక్కన ఉన్న పాన్‌షాప్‌లో దూరి అక్కడ వస్తువులను ఎత్తుకుపోవడం చేస్తున్నాయి. వాటిని అదిలించడానికి ప్రయత్నిస్తే మనుషుల పైకి తిరగబడటం మొదలెట్టాయి. సమీప విభాగాల్లో దూరి బైకు ట్యాంకులపై ఉన్న కవర్లను పీకేస్తున్నాయి. పొరపాటున అందులో ఎవరైనా కాగితాలు, టిఫిన్ బాక్సులు మరిచిపోతే వాటిపై ఆశ వదులుకోవడమే. ఇటీవల కొత్తగా షిఫ్ట్ రూమ్‌లు, ఆఫీసు కార్యాలయాల్లోకి చొరబడి అందులో ఉన్న క్యారేజీలను లాక్కెళ్లి పోతున్నాయి. వాటిని చూసి ఉద్యోగులు హడలిపోతున్నారు. ఇంత జరుగుతున్నా వాటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.

బీభత్సం చేస్తున్నాయి

కోతుల వల్ల భయంగా ఉంది. బైక్‌ల సీటు కవర్లు, ట్యాంక్ కవర్లు చింపేస్తున్నాయి. పొరపాటున బైక్‌లో ఏమైనా మర్చిపోతే వాటిని మరిచి పోవాల్సిందే. అందులో ఉండే వస్తువులను కూడా పారేస్తున్నాయి. ఇక క్యారేజీలు ఎక్కడ పెట్టాలన్నా, భోజనం చేసే దగ్గర కూడా వాటిని చూసి భయపడాల్సి వస్తుంది. కోతుల నివారణకు సత్వరం చర్యలు తీసుకోవాలి.

సేవా కార్యక్రమాలతో వైఎస్సార్ వర్ధంతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సెప్టెంబర్ 2న నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సూచించారు. అన్ని వార్డుల్లోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ రాష్ట్ర కమిటీ, వార్డు కమిటీ, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. స్థానిక బీసీ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల్లో రక్తదాన శిబిరాలు తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, మార్టుపూడి పరదేశి, ధర్మాల శ్రీను, మహేశ్వర రెడ్డి, గొందేశి వెంకట రమణారెడ్డి, సీరట్ల శ్రీనివాస్, ఎన్నేటి రమణ, పి.ప్రమీల, నాగిశెట్టి శ్రీను, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, సంపంగి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్ అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు ఎనలేనివి



స్టీల్‌ప్లాంట్ విభాగాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



వెంకటరావు దంపతులను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్ బీఎఫ్ విభాగం ఫోర్‌మన్ తిప్పల రమణారెడ్డి, ఎఫ్.ఎం.డి విభాగం ఫోర్‌మన్ అప్పలరెడ్డి, క్యూఏటీడీ విభాగం ఫోర్‌మన్ గురుమూర్తి గురువారం రిటైర్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో జరిగిన వీడ్కోలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని, వారిని సత్కరించారు. ప్లాంట్ ప్రారంభం నుంచి ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. వారి భావి జీవితం సుఖవంతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి, తిప్పల వంశీరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వై.మస్తానప్ప, మార్టుపూడి పరదేశి, డి.శ్రీనివాసరెడ్డి, పిట్టా రెడ్డి, ఆయా విభాగాల అధికారులు, సహోద్యోగులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ సింటర్‌ప్లాంట్ విభాగంలో చార్జిమన్‌గా పని చేసి రిటైర్ అయిన కులుకూరి వెంకటరావును ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. పెదగంట్యాడలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటరావు, వెంకటరత్నం దంపతులను వారు సన్మానించారు. సంఘం సభ్యుడు కులుకూరి మంగరాజు, కులుకూరి శ్రీనివాసరావు, వుమ్మిడిశెట్టి వెంకటరావు, నాగమళ్ల ప్రభోజీ తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడి సన్నిధిలో శ్రావణ పౌర్ణమి పూజలు

బాబా విగ్రహానికి రాఖీ కట్టిన మహిళలు



సాయినాథుడి విగ్రహానికి రాఖీ కడుతున్న మహిళలు

అగనంపూడి: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని అగనంపూడి షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. సాయినాథుడి విగ్రహానికి మహిళలు రాఖీ కట్టారు. బాబా కరుణా కటాక్షాలు భక్తులపై ఉండాలని ప్రార్థించారు. స్థానిక భక్తుడు లోకేష్ సహకారంతో మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొయ్య వెంకట రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, పీఎల్ఎన్ రాజు, గోవిందరావు, టోపీ రాజు, సత్యలక్ష్మి, శ్రీదేవి, పంకజ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరణకు వినతి

అగనంపూడి: విశాఖ–నర్సాపురం మధ్య గతంలో నడిపిన నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ పలు ప్రజా సంఘాలు రైల్వే జనరల్ మేనేజర్, రైల్వే బోర్డు అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందించారు. కరోనా సమయంలో నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేశారన్నారు. ఇటీవల సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను కూడా రద్దు చేయడంతో ప్రయాణికులకు విశాఖ నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు రాకపోకలు ఇబ్బందికరంగా మారాయన్నారు. ఈ రెండు రైళ్లు నేరుగా ఉభయ గోదావరి జిల్లాల వరకు నడవడం వల్ల వేలాది మందికి ఉపయోగంగా ఉండేవని పేర్కొన్నారు. ఆక్యుపెన్సీ రేటు కూడా ఎక్కువగా ఉండే ఈ రైళ్లు ఎందుకు నిలిపివేశారో ఇప్పటికీ అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను పునరుద్ధరించాలని ప్రజా సంఘాల నాయకులు కె.ఈశ్వర్, కాటం చంద్రరావు, మంత్రి రాజశేఖర్ తదితరులు కోరారు.

జ్ఞాన సరస్వతి విగ్రహావిష్కరణ




మాధవధార హైస్కూల్ ఆవరణలో జ్ఞాన సరస్వతి విగ్రహం



మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

మద్రిపాలెం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా గురువారం 50వ వార్డు మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు పొన్నాడ అప్పారావు మాస్టర్, సుజాత దంపతులు తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ హనుమంతు లజపతిరాయ్, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎక్కడ సరస్వతీదేవి కొలువై ఉంటుందో అక్కడ విద్యార్థులకు ఉన్నత విద్య లభిస్తుందని, తద్వారా హైస్థాయికి చేరుకుంటారన్నారు. ఇదే స్కూల్‌లో డ్రిల్ మాస్టర్‌గా విధులు నిర్వహించిన అప్పారావు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. లజపతిరాయ్ మాట్లాడుతూ స్కూల్ ఆవరణలో చదువుల తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించడం స్వయంగా ఆమె ఇక్కడ జన్మించినట్టు అనిపిస్తోందన్నారు. కార్పొరేటర్ ప్రసాద్ మాట్లాడుతూ తన వార్డులోని పాఠశాలలో జ్ఞాన సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పేడాడ రమణికుమారి, పైడి శ్రీను, సనపల నారాయణ స్వామి, పాఠశాల హెచ్‌ఎం బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

931వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మికులు

కూర్మన్నపాలెం: కార్మికులను రోడ్డున పడేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ కుటిల నిర్ణయాన్ని దేశ ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 931వ రోజు గురువారం పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. దేశంలో సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి దానిని అమ్మే హక్కు లేదన్నారు.కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ఆలోచనను విరమించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుమల బాలాజీకి తిరుప్పావడ సేవ



తిరుప్పావడ సేవలో భాగంగా శ్రీవారికి నివేదించిన పులిహోర

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో శ్రీ తిరుమల బాలాజీకి గురువారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. స్వామివారికి పులిహోర రాశులుగా పోసి, జిలేబీలు తదితర వంటకాలతో తిరుప్పావడ సేవా పూజ జరిపించారు. తిరుమల బాలాజీ నేత్ర దర్శనంతో భక్తులు పరవశులయ్యారు. సాయంత్రం పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఎమ్మెల్యే దృష్టికి 87వ వార్డు సమస్యలు



ఎమ్మెల్యే నాగిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులో నెలకొన్న పలు ప్రజాసమస్యలను పరిష్కరించాలని వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని కోరారు. ఎమ్మెల్యేను, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ దేవన్‌రెడ్డిని గురువారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా వార్డులో లబ్ధిదారులకు లోన్ మంజూరు చేయాలని, 87వ వార్డు ప్రధాన కాలువ మరమ్మతులను చేపట్టి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ అవుట్‌లెట్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు విద్యార్థుల విరాళం



చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధికి చెక్కు అందిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లో శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్‌కు భారీ విరాళం అందజేశారు. ఆరిలోవలో ఎస్.సుబ్బలక్ష్మి అనే మహిళ నిర్వహిస్తున్న ఈ ఫౌండేషన్‌కు విరాళం అందజేయడానికి శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చారు. ఈ మేరకు 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఇటీవల రూ.2,44,552 వరకు విరాళాలు సేకరించారు. ఆ నగదును చెక్కు రూపంలో గురువారం పాఠశాలలో ఆరిలోవ సీఐ సోమశేఖర్ సమక్షంలో ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.సుబ్బలక్ష్మికి అందజేశారు. విద్యార్థులను సీఐ అభినందించారు. చిన్నతనం నుంచే ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన కలగడం అభినందనీయమన్నారు. పాఠశాల అధినేత మోహన్‌కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్ కాంప్లెక్స్‌లో పలు సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, సీఆర్‌పీ ఎల్.చైతన్య వీటిని పర్యవేక్షించారు. కంచరపాలెం, కప్పరాడ, తిక్కవానిపాలెం, ధర్మానగర్, కె.కాలనీ, సుభాష్‌నగర్, రాంజీ ఎస్టేట్ తదితర పాఠశాలలకు చెందిన సబ్జెక్ట్ టీచర్లు పాల్గొన్నారు.